క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారా యణ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతన దారులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ వెంట సర్పంచ్ రాము నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ పెంటయ్య ఉన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్టోత్సవాలు



ప్రతిష్టోత్సవాలకు సిద్ధమైన కోదండ రామాలయం

మెరకముడిదాం: మండలంలోని చెల్లాపురం గ్రామంలో కోదండ రామాలయ ప్రతిష్టోత్స వాలను శుక్రవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న ట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు గురువారం తెలిపారు. తొలిరోజు శుక్రవా రం, రెండో రోజు శనివారం వివిధ పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడోరోజు ఆదివారం ఉదయం 7.11 గంటలకు విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు పేర్కొన్నారు.

రక్షిత మంచినీటి పథకానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కొండమ్మ, తదితరులు

గజపతినగరం: స్థానిక బజారు జంక్షన్ వద్ద రక్షిత మంచినీటి పథకానికి సర్పంచ్ నరవ కొండమ్మ గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి కళావతి, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, పంచాయతీ కార్యనిర్వహణాధికారి జి.జనార్ధన రావు తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టాలి



కనిమెరకలో సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ తులసీనాథ్

బొండపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ అన్నారు. మండలంలోని కనిమెరకతో పాటు పలుగ్రామాల్లో గురువారం పింఛన్ల పంపిణీ తో పాటు పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. వీధి కాలువలు, బహిరంగ ప్రదేశాలను పరిశీలించి సచి వాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు, పంచాయతీ కార్యద ర్శులు సత్యవతి,మాధవి తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన కండక్టర్‌కు సన్మానం



కండక్టర్ కుమార్‌ను సన్మానిస్తున్న డీఎం సురేష్,ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్ట ర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన బి.ఆర్. కుమార్‌ను డిపో కార్యాలయ ప్రాంగణంలో డీఎం కె.సురేష్, ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. కండక్టర్ కుమార్ అందించిన సేవలను పలువురు ఉద్యోగులు ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన కండక్టర్ తన సహోద్యోగుల్లో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేశారు. రూ.50, 000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగుల సహాయార్థం ఖర్చు చేస్తానని ప్రకటించారు.

విస్తరిస్తున్న.. బొప్పాయి సాగు...

- చీపురుపల్లి నియోజకవర్గంలో 250 ఎకరాల్లో సాగు
- ఖర్చు తక్కువ లాభాలు ఎక్కువ
- కొనసాగుతున్న గత ప్రభుత్వ రాయితీలు



పుర్రేయవలస సమీపంలో బొప్పాయి తోట

చీపురుపల్లి: ఆరోగ్య జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్లలో బొప్పాయిది ప్రథమ స్థానం. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారు సైతం బొప్పాయి తినొచ్చని వైద్యులు సూచిస్తుంటారు. మనిషిలో రక్తాన్ని శుద్ధి చేసే గొప్ప గుణం బొప్పాయికి ఉంటుంది. అలాంటి బొప్పా యి పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలో రైతులు బొప్పాయి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. క్రమంగా ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగు తోంది. బొప్పాయి సాగుపై ఉద్యానవనశాఖాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వాలు ఈ పంట సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని రైతులకు వివరిస్తున్నారు. బొప్పాయి సాగుకు గత ప్రభుత్వంలో అందించిన రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో 250 ఎకరాల్లో రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారా లు పొలాల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పంట రవాణా ఖర్చు కూడా తగ్గుతోంది.

చీపురుపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా బొప్పాయి సాగు విస్తీర్ణం వివరాలు...

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
చీపురుపల్లి	130
గరివిడి	70
గుర్ల	30
మెరకముడిదాం	20

రూ.70 వేల ఖర్చు..రూ.3 లక్షల ఆదాయం

బొప్పాయి సాగులో రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖాధికారులు అంటున్నారు. ఉద్యానవన శాఖాధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరానికి 60 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎకరా సాగుకు రూ.70 వేల వరకు ఖర్చు అవుతుందని, పంట దిగుబడి బాగుంటే రూ.3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని అంటున్నారు.

రాయితీలు...

బొప్పాయి సాగుకు గత ప్రభుత్వంలో అమలు చేసిన రాయితీలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. అందులో భాగంగానే హెక్టారుకు రూ.18,500 రాయితీగా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రాయితీ కోసం రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని విత్తనాలు, ఎరువులు, స్ప్రేయింగ్ కెమికల్స్ బిల్లులు, పంట ఫొటో జత చేయాల్సి ఉంటుంది. అలాగే పంట సాగులో మల్చింగ్ కోసం మొక్క చుట్టూ మట్టిని కప్పి ఉంచడానికి పాలథిన్ ఫిల్మ్ కప్పాల్సి ఉంటుంది. దీంతో మొక్క వృద్ధి చెందుతుంది. దీని కోసం హెక్టార్‌కు రూ.16 వేలు అందించనున్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు హెక్టార్ కు రూ.80 వేల విలువైన పరికరాలను రాయితీపై అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

బొప్పాయి సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. హెక్టారుకు రూ.18,500 సాగు ప్రోత్సాహంతో పాటు మల్చింగ్ కోసం రూ.16 వేలు అందజేస్తున్నారు. డ్రిప్ కోసం హెక్టార్‌కు రూ.80 వేల వరకు రాయితీ కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించే బొప్పాయి సాగుపై రైతులు దృష్టి సారించాలని విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్.చంద్రశేఖర్, ఉద్యానవనశాఖాధికారి, చీపురుపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని చినమధుపాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బంకపల్లి శివ ప్రసాద్ సూచించారు. చినమధుపాడ గ్రామంలో తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. కాన్వెంట్‌లకు ధీటుగా తమ పాఠశాలలో బోధిస్తున్నామని వివరించారు.

– గంట్యాడ

ఏం ప్రయోజనం...?



గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామానికి సమీపంలోని జాతీయ రహదారిని అనుసంధానిస్తూ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి ఇటీవల రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు చివరి వరకూ అర్ధభాగమే పనులు చేయించి, మిగతా పనులు మధ్యలో వదిలేశారు. దీంతో ఇటు పాదచారులు, అటు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను ఆ గ్రామ సచివాలయ కార్యదర్శి రోజ్‌లీనా వద్ద సాక్షి ప్రస్తావించగా... రోడ్డు నిర్మాణానికి మొదటి విడతలో విడుదలైన నిధులతో రోడ్డు పనులు సగం వరకు పూర్తయ్యాయని, మిగతా పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేయిస్తామని చెప్పారు.

– గజపతినగరం రూరల్

బీమా కోసం దరఖాస్తు చేసుకోండి



పనులు పరిశీలిస్తున్న ఏపీఓ అరుణ

బొండపల్లి: ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి దరఖాస్తు చేసు కోవాలని ఉపాధి హామీ ఏపీఓ జి.అరుణ సూచించారు. నెలివాడ గ్రామంలోని చిన్నరాజు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం వేతనదారులకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. బీమా పథకంలో చేరేందుకు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబ ర్, ఫోటోతో పాటు దరఖాస్తును ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేయాలని చెప్పారు. బీమా ప్రీమియం కోసం వేతనదారుడి బ్యాంకు ఖాతా నుంచి ఏడాదికి రూ.20 మినహాయించుకుంటారని తెలిపారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

సమ్మర్ బూట్ క్యాంప్ ప్రారంభం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సమ్మర్ బూట్‌క్యాంప్‌ను జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, ఎంఈఓ బి.నర్సింగరావు గురువారం ప్రారంభించారు. తొలిరోజు వేర్వేరు పాఠశాలలకు చెందిన 35మంది 8,9 తరగతుల విద్యార్థులకు, లెండి ఇంజి నీరింగ్ కళాశాలలకు చెందిన ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు మొదటి రోజు తొలి సెషన్‌లో పేపర్ ట్రోనిక్స్, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల పనితీరుపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం సీలాంగ్వేజ్, కోడింగ్, సర్క్యూట్ డిజైనింగ్ నేర్పారు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు, ల్యాబ్ ఇన్‌చార్జ్ వి.రమేష్, ఉపాధ్యా యులు జయ సుధ, సురేంద్రనాథ్, సరస్వతి, ఏ.వీరాస్వామి, రహీం షేక్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

లాటరీలో షెడ్ల కేటాయింపు



షెడ్లలో కూరగాయల విక్రయాలు ప్రారంభించిన వ్యాపారులు

గజపతినగరం: స్థానిక బజారు సెంటర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో నాబార్డ్ నిధులతో నిర్మించిన దుకాణాల షెడ్లను లాటరీ విధానంలో వ్యాపారులకు కేటాయించారు. దుకాణాలను పంచాయతీ ఈఓ జి.జనార్దనరావు వ్యాపారులకు గురువారం అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 షెడ్లలో 25 షెడ్లను లాటరీ పద్ధతిలో వ్యాపారులకు అప్పగించామని, ఇక నుంచి వాటిలో వారు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని చెప్పారు.

సారా స్థావరంపై దాడి

చీపురుపల్లి రూరల్: గుర్ల మండలంలోని దేవునికణపాక గ్రామంలోని నాటుసారా స్థావరంపై నెల్లిమర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు, ఎస్‌ఐ ఎం.నాగేశ్వరరావు తమ సిబ్బందితో గురువారం దాడి చేశారు. అరసవిల్లి నరసయ్య అనే వ్యక్తి 5 లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో హెచ్‌సీలు ఎం.అప్పారావు, వి.కృష్ణ, కానిస్టేబుల్ సీహెచ్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్కవరపుకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్.సూరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.టౌన్ ఫీడర్ విద్యుత్ లైన్‌లో వైర్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలిగింపు, మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్కవరపుకోట, సోంపురం జంక్షన్, సంతపేట జంక్షన్‌లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్ల మండలంలో...

చీపురుపల్లిరూరల్: గుర్ల మండలంలోని అచ్యుతాపురం ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగ నుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చోడవరం,పెనుబర్తి, చుక్కపేట, చింతపల్లిపేట, గంగిరెడ్డిపేట, అచ్యుతాపురం, తెట్టంగి, పోలాయవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని బొబ్బిలి డివిజన్ విద్యుత్ కార్యనిర్వహణాధికారి ఏ.అనంతరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.సబ్‌స్టేషన్ పరిధిలోని మెయిన్ హెడ్ క్వార్టర్ ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. పురిటిపెంట, పురిటిపెంటలోని జగనన్న కాలనీ, న్యూకాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆ ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణం కాదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో ఏప్రిల్ 28వ తేదీ రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి 8 ఎకరాల సరుగుడుతోట దగ్ధమైన ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సన్యాసిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించిందని బాధిత రైతు ఫిర్యాదు ఇవ్వడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించామని పేర్కొన్నారు. ఆ స్థలంలో అనధికార సర్వీసులు ఏమీ లేవని, విద్యుత్ వైర్లు తెగిపడలేదని, షార్ట్ సర్క్యూట్ జరగలేదని నిర్ధారించామని తెలిపారు.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి

- ఘనంగా మే డే

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని వామపక్ష పార్టీలు తమ అనుబంధ శాఖల నేతృత్వంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ కార్యాలయాల వద్ద, ప్రధాన జంక్షన్‌లలో, పరిశ్రమల వద్ద, ఆటో స్టాండ్‌ల్లో కార్మిక సంఘాల నాయకులు ఎర్ర జెండాలను ఎగురవేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నేటికీ కనీస వేతనాలు అందడం లేదని, కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోపిడీ చేస్తుంటే వారికి కేంద్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తోందని ఆరోపించారు. కార్మికులకు రక్షణగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన వేడుకల్లో జూనియర్ సివిల్ జడ్జి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. పని చేస్తున్న సమయంలో కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, గాయాలపాలైనా ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని చెప్పారు. సంబంధిత యాప్‌ను కార్మికులు తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్ లోడ్ చేసుకుని వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

–సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు



వేపాడ: సోంపురం క్వారీల కూడలి వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు



శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ జంక్షన్‌లో మేడే సందర్భంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న బైక్ మెకానిక్‌లు



చీపురుపల్లి: వెంకట్రామా పొల్ట్రీ పరిశ్రమ ఎదుట జెండా ఎగుర వేస్తున్న కార్మికులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



గజపతినగరం: గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌రాజ్‌కుమార్



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహించిన వేడుకల్లో ఉద్యోగులు



గంట్యాడ: కొఠారుబిల్లిలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాంబాబు



వేపాడ: వేపాడలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సుదర్శన్



దత్తిరాజేరు: కోమటిపల్లి ఆటో స్టాండ్‌వద్ద నిర్వహించిన వేడుకల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, తదితరులు



లక్కవరపుకోట: ఎల్.కోటలో హాస్టల్ జంక్షన్ వద్ద సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న నాయకులు, కార్మికులు,



కొత్తవలస: కోటపాడు ఆటోస్టాండ్ వద్ద జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అప్పలరాజు



కొత్తవలస: కొత్తవలసలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



శృంగవరపుకోట: ఎస్.కోటలో నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



శృంగవరపుకోట: బొడ్డవర ఆటోస్టాండ్ వద్ద వేడుకల్లో ఆటోడ్రైవర్లు



గజపతినగరం: గజపతినగరం మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న నాయకులు